

నా కళ్లుమూసుకు పోయాయి. నా భార్య నల్లటిది. అందగత్తె కాదు. ఈ రాగవతి అందానికి మురిసి మూర్ఛపోయాను. ఇప్పుడు రెంటికీ చెడ్డ రేవడిన య్యాను'' అని విచారం వ్యక్తంచేశాడు మదనాంకుడు.

''సరే.. ఇప్పటికైనా ఇంటికి పోదాం'' అన్నాడు చంద్రస్వామి.

''ముందుగా నీ రూపం మార్చాలి. పద.. ఈ విద్యలు నాకు రేపటికల్లా పనికిరాకుండా పోతాయి. ఆలోపుగా ఇక్కణ్నుంచి వీలైనంత దూరం వెళ్లిపోదాం'' అన్నాడు మదనాంకుడు.

వాళ్లిద్దరూ హిమాలయాల నుంచి మధురాపురం దిశగా ఆకాశమార్గంలో కొంతదూరం ప్రయాణించారు. విద్యలు అంతరించిన తరువాత కాలినడక సాగించారు.

కొన్నినెలల ప్రయాణం తరువాత మధురాపురంలో ప్రియంవద అత్తవారింటికి వెళ్లారు.

''మేము కాశీనుంచి వచ్చాం. వరాహదత్తుల వారిని, ప్రియంవదను కలుసుకోవాలి. శ్రీగర్భులవారు పంపిన వర్తమానం తెలియచేయాలి'' అని పరిచారకునితో చెప్పారు.

''వరాహదత్తుడు చనిపోయి ఎనిమిదేళ్లయింది. ప్రియంవద చనిపోయి కూడా ఆరునెలలు దాటిపో యింది'' అని చెప్పాడు పరిచారకుడు.

ఆ మాటతో విస్తుపోయారు స్నేహితులిద్దరూ. చేసే దేమీ లేక ఇద్దరూ కాశీనగరానికి ప్రయాణమయ్యారు.

మరికొన్నినెలల కాలం తరువాత కాశీకి చేరుకోగలి గారు. చంద్రస్వామి చెప్పిన గుర్తుల ప్రకారం ప్రియం వద వద్ద పనిచేసిన దూతిక ఇంటికి వెళ్లారు.

ఆమె వీరిని చూసి ఆశ్చర్యపోయింది.

''ప్రియంవద ఎలా చనిపోయింది?'' అని ఆదు ర్దాగా ప్రశ్నించాడు చంద్రస్వామి.

''అది తెలియాలంటే ఆమె కథంతా చెప్పాలి'' అంటూ కథ చెప్పడం మొదలుపెట్టింది దూతిక.

* * *

ప్రియంవద కాపరానికి వెళ్లిన తరువాత కొంతకాలం బాగానే నడుచుకుంది. ఇంతలో సోదరుడి వివాహం జరుగుతుంటే మళ్లీ కాశీకి వచ్చింది. అలా వచ్చిన ప్రియంవద మళ్లీ అత్తవారింటికి పోలేదు. భర్త ఎన్ని సార్లు కబురు చేసినా, ఆరోగ్యం బాగోలేదని సమా ధానం చెబుతూ వచ్చింది. అసలు సంగతేంటో కనుక్కో మని వరాహదత్తుడు తన స్నేహితుడైన లంపటుడనే వాణ్ని పంపాడు. అతను వచ్చేసరికి మరింత అనా రోగ్యం నటించసాగింది.

''అన్నయ్యా! నీ దగ్గర సిగ్గుపడటం ఎందుకు?! నా అనారోగ్యం గురించి బాగా తెలిసిన వైద్యుడిక్కడ ఉన్నాడు. ఆయన నా రోగం తగ్గాలంటే దాంపత్యసుఖా నికి దూరంగా ఉండాలని చెబుతున్నాడు. నేనక్కడికి వస్తే నీ స్నేహితుడు నన్ను విడిచిపెడతాడా!? అందుకే నేను రావడం లేదు. మరేమీ కారణం లేదు'' అన్నది.

అందుకు లంపటుడు తెలివిగా..

''మంచిదే కానీ అమ్మాయీ! మగవాణ్ని ఎక్కువ కాలం ఒంటరిగా వదిలేయడం మంచిది కాదు. భార్యను మరిచి ఇతర స్త్రీలను మరిగితే మళ్లీ దారికి తెచ్చుకోవడం కష్టం. ఇప్పటికే మీ ఆయన ఒక వేశ్యకు కన్నెరికం చేశాడు. రాత్రీపగలూ దానిదగ్గరే ఉంటు న్నాడు'' అని భయపెట్టి ఆమెను ఇంటికి తిరిగి తీసుకువె ళ్లాలని ప్రయత్నించాడు. కానీ ప్రియంవద తగ్గలేదు.

''ఈ మాట విన్నాక నాకింకా సంతోషంగా ఉంద న్నయ్యా! తుమ్మెద ఎన్ని పువ్వులమీదైనా వాలవచ్చు. ఆయన సుఖపడుతున్నాడంటే నాకు ఆనందమే. నా మనసులో బాధ తగ్గింది'' అన్నది.

ఆమె మాటలు విని లంపటుడు విస్తుపోయాడు. మా టలతో కాపరానికి రాదని అర్థమై వెనుతిరిగాడు.

''బావమరిది పెళ్లికి వెళ్లినవాడివి.. నీ పెళ్లాన్ని వెంటనే వెంట తెచ్చుకోకపోవడం నీదే తప్పు. నా అను మానం నిజమైతే మీ ఆవిడ వైద్యుడితో సంబంధం పెట్టుకుంది. ఇక నీకు దక్కదు'' అని వరాహదత్తుడికి చెప్పాడు.

ఆ వర్తమానం విన్న వరాహదత్తుడికి క్రోధం ముంచు కొచ్చింది. ఈసారి తానే స్వయంగా వచ్చి, ప్రియంవ దను బలవంతంగా తనవెంట తీసుకుపోయాడు.

అడవిమార్గం గుండా వెళ్తుండగా ఒకచోట పల్లకి ఆపించాడు. సేవకులందర్నీ దూరంగా పంపించేశాడు. ఒక చురకత్తితో భార్య ముక్కుచెవులు కోసేయాలని ముందుకొచ్చాడు. అంతటి రౌద్రంలోనూ అతనికి భార్యమొహం చూడగానే మోహపు తెర కమ్ముంది. కత్తి పక్కన పారేసి శృంగారం మొదలుపెట్టాడు. ప్రియంవద అరిచి గోలపెట్టింది.

''కత్తితో కాకుండా నన్ను ఇలా చంపాలని ప్రయత్ని స్తున్నావు'' అంటూ అతనికి సహకరించకుండా పెనుగు లాడ సాగింది.

''నేను నిన్నేమీ చేయను'' అని వరాహదత్తుడు ఎంతో బతిమాలినా వినిపించుకోలేదు.

''ఒక పని చెయ్యి. నీ చేతులు, కాళ్లు కట్టివేస్తాను. నిన్ను పురుషాయిత క్రీడలో మెప్పిస్తాను. అప్పుడే నిన్ను నమ్మగలను'' అన్నది ప్రియంవద.

''ఎలాగోలా ముచ్చట తీరితే చాలు'' అన్నాడు వరాహదత్తుడు.

అతణ్ని బంధించిన ప్రియంవద.. నిర్దయగా అతని ముక్కుచెవులు కోసేసింది. అతని దుస్తులు తాను ధరించి, పురుషవేషంలో గుర్రాన్నెక్కి ఎటో వెళ్లిపో యింది. ఆ తరువాత వరాహదత్తుణ్ని ఎవరో ఆటవి కులు కాపాడారు. ఎలాగో మధురాపురం చేరుకు న్నాడు. ముక్కు చెవులు కోసేసినప్పుడు తీవ్రమైన గాయాలయ్యాయి. ఆ గాయాలనుంచి అతను చాలా కాలం కోలుకోలేకపోయాడు.

ఈలోపుగా ప్రియంవద ఎక్కడెక్కడో తిరిగింది. యథే చ్ఛగా కోరుకున్న మగవాళ్లతో గడిపింది. చివరికి ఆమె గర్భవతి అయింది. ఒకనాడు ఒంటరిగా ఇంటికి తిరిగి వచ్చింది. తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు.

''నీ మగడు నిన్ను ఒంటరిగా ఎలా పంపించాడు?! మాకు చెపితే మేమైనా పల్లకి పంపించేవాళ్లం కదా!'' అన్నారు.

'హమ్మయ్య. నా సంగతి వీళ్లకింకా పూర్తిగా తెలీదు' అనుకుంది ప్రియంవద.

పుట్టింట్లో పురుడు పోసుకుంది. పండంటి మగబి డ్డను కన్నది. పిల్లవాడు పుట్టిన విషయం తన తండ్రి వరాహదత్తునికి తెలియచేయకుండా రెండేళ్లవరకు అనేక పన్నాగాలు పన్ని అడ్డుకుంది. ఆ తరువాత మెల్లిగా గుస గుసలు మొదలయ్యాయి. అప్పుడు తనతో సంబంధం ఉన్న వైద్యుణ్ని మధురాపురం పంపింది. వరాహద త్తుడు మరణశయ్యమీద ఉన్నాడని వైద్యుడు సమా చారం ఇచ్చాడు. దాంతో మళ్లీ అత్తవారింటికి బయల్దే రింది. నేరుగా లంపటుడి ఇంటికి వెళ్లి, తన కొడుకును చూపించింది.

''అన్నయ్యా! నీ చెల్లినే అనుకుని, నేను చేసిన పను లన్నీ క్షమించు. ఎంతకాదనుకున్నా వీడు నీ స్నేహితు డికి క్షేత్రజుడు అవుతాడు. ఆయన ఆస్తి ఎవరెవరికో పోవడం కంటే వీడికి దక్కడమే న్యాయం కదా! నువ్వే న్యాయంగా ఆలోచించి చెప్పు'' అని దీనాలాపాలు చేసింది.

లంపటుడు ఆమె మాటలు నిజమేననుకున్నాడు. అప్పటికే వరాహదత్తుడు వీలునామా రాసినా సంతకం చేయలేదు. లంపటుడు దానిని ప్రియంవద కొడుకు పేరుమీదికి మార్చివేశాడు.

మరణశయ్యమీద ఉన్నందువల్ల భార్య వచ్చినా, ఆమెనేమీ అనలేని స్థితిలో ఉన్నాడు వరాహదత్తుడు. ఆరోజే ప్రాణాలు విడిచాడు. దాంతో కోట్లవిలువైన ఆస్తి పాస్తులు ఆమె చేతిలోకి వచ్చిపడ్డాయి. ఆ తరువాత ఆమె ఆడింది ఆట, పాడింది పాట అయిపోయింది. దాంతో అనేక రోగాలు చుట్టుముట్టాయి. వాటితోనే ఆరునెలల కిందట చనిపోయింది. ఈ విషయాలన్నీ తెలిసిన తరువాత ఆమె కొడుకును శ్రీగర్భుడు దగ్గరికి చేరనీయలేదు. లంపటుడు అతణ్ని కాపాడాడు.

* * *

అంటూ ముగించింది దూతిక.

..ఆ కథంతా విన్నతరువాత చంద్రస్వామి, మదనాం కుడు కన్నీరు కార్చారు.

కొంతసేపటి తరువాత..

''ఇంతకూ దూతికా! అప్పుడు యోగిని ఇచ్చిన మూలిక నీ దగ్గరుందా?'' అని ప్రశ్నించాడు మదనాంకుడు.

''నా దగ్గరలేదు. నేను, ప్రియంవద దానిసంగతే మరిచిపోయాం'' అని సమాధానమిచ్చింది దూతిక.

''అయితే ఇప్పుడెలా? ఇతనింక ఈ కోతిరూపంలో ఉండిపోవాల్సిందేనా?'' అడిగాడు మదనాంకుడు.

''ఆ యోగిని ప్రస్తుతం కాశీలో లేదు. ఎక్కడికో యాత్రలకు వెళ్లింది. కొద్దిరోజులు ఓపిక పడితే వస్తుంది. ఆమె వచ్చేదాకా వేచి ఉండటం మినహా మార్గం లేదు'' అని జవాబిచ్చింది దూతిక.

''మిత్రమా! నా కోసం అంతకాలం నువ్వు ఇక్కడే ఉండటం ఎందుకు. నువ్వు ఇంటికి వెళ్లు. నీ వాళ్లను చూసుకో'' అన్నాడు చంద్రస్వామి. ■

**(వచ్చేవారం.. బంగారు ఎలుక)**